క్లుప్తంగా

పారదర్శకత ముఖ్యం

● అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న బాలరాజు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు పేర్కొన్నారు. సోమవారం సిర్గాపూర్‌లో 3వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డీఆర్‌పీలు, తనిఖీ నివేదికను చదివి వినిపించారు. అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు ఉపాధి హామీ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉపాధి పనుల్లో లొసుగులు బయట పడడంతో రూ. 1,34,818 లక్షల రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ రాజు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, జేటీసీఓ సుభాష్, ఎంపీడీఓ మల్సూర్, ఎస్‌ఆర్‌పీ నర్సయ్య, ఏపీఓ బస్వరాజు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' పత్రాల పంపిణీ



పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): మహాలక్ష్మి పథకంలో భాగంగా సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల 500 మంది లబ్ధిదారులకు మంజూరైన సబ్సిడీ గ్యాస్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు శివచంద్రకుమార్ పాటిల్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎంపీడీఓ హరినందన్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఘన విజయం



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్లమాచునూరు గ్రామ శివారులోని ఆర్చి ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ ఘనవిజయం సాధించింది. పరిశ్రమలో 59 మంది కార్మికులు ఓటర్లుగా ఉండగా బీఎంఎస్ అధ్యక్షుడిగా పోటీ చేసిన వడిగపల్లి ప్రభుకి 40 ఓట్లు రావడంతో విజయం సాధించారు. సీఐటీయూ తరపున పోటీ చేసిన వడిగపల్లి శ్రీరాములుకు 18 ఓట్లు వచ్చాయి. దీంతో బీఎంఎస్ ఘన విజయం సాధించడంతో కార్మికులు పరిశ్రమ ఎదుట సంబరాలు చేసుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రభు పేర్కొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

● భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సంగారెడ్డి టౌన్ : అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా వెంటనే అమలు చేయాలని, రెండు లక్షల రుణ మాఫీని ప్రతి ఒక్కరికి వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రైతులు కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై దృష్టి సారించండి

రాయికోడ్(అందోల్): గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్ పేర్కొన్నారు. మండలంలోని సంగాపూర్ గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మురుగు నీటి గుంటలు లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను ఆదేశించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డంప్ యార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజలిదేవి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

● సీడీపీఓ ప్రియాంక

హత్నూర (సంగారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ప్రియాంక అన్నారు. సోమవారం హత్నూర రైతు వేదికలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని మండలస్థాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకున్న పిల్లలు బరువు, ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. నెలరోజుల పాటు ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీఓ శంకర్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, గ్రామ కార్యదర్శి మహేశ్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ జయరాంనాయక్ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పాశమైలారంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయరాంనాయక్ మాట్లాడుతూ.. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనత సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రసన్న, అక్షరా భ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సల్మా, అంగన్‌వాడీ టీచర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న జయరాంనాయక్

సమతుల్య ఆహారంతో ప్రయోజనం

జహీరాబాద్: కేవీకే-ఐసీడీఎస్ అనుసంధానంతో పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జహీరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత మాట్లాడుతూ.. సమతుల్యమైన ఆహారం ప్రాధాన్యతను వివరించారు. రక్తహీనతను నివారించడానికి ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషక ఆహార నియమాలను తెలియజేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ అంజమ్మ మాట్లాడుతూ.. మహిళలంతా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు పలు రకాల వంటకాలను తయారు చేసుకుని వచ్చి ప్రదర్శించారు. ఎంపికయిన వంటకాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, ప్రియాంక పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం చేస్తున్న అధికారులు

భూములు అప్పగించాలని వినతి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

సంగారెడ్డి జోన్: పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలోని హెచ్‌ఎండీఏ స్వాధీనం చేసుకున్న గ్రామస్తుల భూములను తిరిగి వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నం. 496లో సుమారు 30 ఎకరాల భూమిలో గత 35 సంవత్సరాల నుంచి 500 కుటుంబాలు ఉంటున్నామన్నారు. అందులో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు. మరికొంత మంది పశువుల కొట్టాలు, చెత్తవేసేందుకు (పెంటకుప్ప) వినియోగించుకుంటున్నారు. ఇల్లు కట్టుకునేందుకు స్థల యాజమాన్య సర్టిఫికెట్లు ఉన్నాయని, పన్నులు సైతం చెల్లిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎండీఏ అధికారులు ప్లాట్లుగా చేసి వేలం వేస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. దీంతో సుమారు 500 కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ అధికారులు ప్లాట్లు చేసేందుకు ఫెన్సింగ్ వేసే పని ఆపాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం బాలమణి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు శోభాక్రిష్టారెడ్డి, మల్లారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

● ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ గంజాయి కేసులో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా మద్య నిషేధ ఎక్సైజ్ అధికారి సమక్షంలో పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 25న ఉ.11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 10 మందిని పట్టుకున్నారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, జడ్జి తొమ్మిది మందికి రూ.2వేలు చొప్పున, మరో వ్యక్తికి రూ. 1500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

బస్‌షెల్టర్‌కు స్థల పరిశీలన

నారాయణఖేడ్: మండలం పరిధిలోని జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాల ఎదుట బస్‌షెల్టర్ నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపిక చేసేందుకు సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, పీఆర్వో పాండు, దాత తానాజీ తదితరులు పర్యటించారు. పట్టణం నుంచి డిగ్రీకళాశాల నాలుగు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు కోరిన మేరకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయించారు. బస్‌షెల్టర్ ఏర్పాటుకు సైతం హామీ ఇవ్వగా పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తానాజీ ఖర్చును సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు కళాశాల ఎదుట స్థలాన్ని ఖరారు చేయగా త్వరలోనే షెల్టర్‌ను నిర్మిస్తామని చెప్పారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారంలో ముందంజ

● పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య

వట్‌పల్లి(అందోల్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య అన్నారు. సోమవారం వట్‌పల్లిలో ఏర్పాటు చేసిన మండల పీఆర్టీయూ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు పెంచిన ఘనత పీఆర్టీయూ సంఘానికే దక్కుతుందన్నారు. పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీ ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, దసరా లోపు 2 డీఏలు రాబోతున్నాయని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డితో ఒప్పందం కుదిరిందన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్, పారిశుద్ధ్య కార్మికుల సమస్యను పరిష్కరించామన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించేందుకు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సందర్భంగా మండల సంఘం నూతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శాఖ అధ్యక్షుడిగా పి.దిగంబర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా టి.నర్సింలుగౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.శ్రీశైలం, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సునిత, కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నరోత్తం, పరిశీలకులుగా రాజమల్లు వ్యవహరించారు. కార్యక్రమంలో శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణయ్య

స్టీల్ బ్యాంక్ ఏర్పాటుకు దాతల ఔదార్యం

కంగ్టి(నారాయణఖేడ్): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు కంగ్టి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్థానికులు రవీందర్‌రావు పాటిల్, గంగాధర్ విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్, విద్యాకమిటీ చైర్మన్ భారతిబాయి చేతుల మీదుగా పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ చేసిన స్టీల్ బ్యాంక్ పిలుపు మేరకు కంగ్టి ప్రాథమిక పాఠశాలలోనే అమలు పరచడంతో దాతలను ఎంపీడీఓ సఅభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **విజేతలకు బహుమతుల ప్రదానం**

జహీరాబాద్ టౌన్: లక్కీ డ్రా విజేతలకు జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం బహుమతులను అందజేశారు. డీలక్స్ బస్సులో ప్రయాణించే మహిళలను ప్రోత్సహించేందుకు లక్కీడ్రా కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. 15 రోజులకు ఒక్కసారి డ్రా తీసి ముగ్గురికి బహుమతులను అందజేస్తోంది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ శివలింగం పాల్గొని లక్కీ డ్రా విజేతలకు వెయ్యి రూపాయల చొప్పున ముగ్గురికి బహుమతులు అందజేశారు.

◆ **మాకు న్యాయం చేయండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటి నిర్మాణం కోసం అన్ని అనుమతులు ఉన్న తమను ఇల్లు కట్టుకోకుండా కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటున్నారని, అధికారులు తమకు న్యాయం చేయాలని గౌతమినగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. సోమవారం గౌతమినగర్ ప్లాట్ ఓనర్స్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈదులనాగులపల్లి పరిధిలో సుమారు 39ఏళ్ల క్రితం ప్లాట్ చేసి అమ్మితే తాము కొనుగోలు చేశామన్నారు. గత కొంతకాలంగా ఇల్లు కట్టుకునేందుకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నామని చెప్పారు. కొంతమంది వ్యక్తులు అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తమ నిర్మాణాలకు అడ్డు తగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్లాట్ ఓనర్స్ అందరం కలసి ఒక అసోసియేషన్‌గా ఏర్పడి పోరాటం చేస్తున్నామని వివరించారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

◆ **తైబజార్ వేలం**

కంది(సంగారెడ్డి): మండల కేంద్రంలోని కంది తైబజార్ వేలం సోమవారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ సమక్షంలో వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన చాంద్ పాష రూ.3,50,000లకు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తైబజార్ కాల పరిమితి 6నెలల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఈఓ విద్యాధర్‌గౌడ్, బిల్ కలెక్టర్లు మల్లేశం, వీర్రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **డిప్యూటేషన్ సరికాదు**

నారాయణఖేడ్: ఉపాధ్యాయులను ఇతర శాఖల్లో డిప్యూటేషన్ వేయొద్దని మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి పేర్కొన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో పలువురు ఉపాధ్యాయులను పంచాయతీల ప్రత్యేక అధికారులుగా డిప్యూటేషన్‌పై నియమించడంతో విద్యావ్యవస్థ కుంటుపడింది. కావున, తాము మండల పరిషత్, జిల్లా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించినందుకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అధికారులు స్పందించి డిప్యూటేషన్లను రద్దు చేసి పాఠశాలలకు పంపినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు ఉపాధ్యాయులను ఇతరశాఖల్లో డిప్యుటేషన్లపై నియమించవద్దన్నారు.

◆ **ఖేడ్‌లో 'స్వచ్ఛతా హీ సేవ'**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపాలిటీకి సంబంధించిన డంప్ యార్డు ప్రహరీ చుట్టూ కమిషనర్ జగ్జీవన్ మొక్కలు నాటి నీరు పోశారు. కార్మికులతో కలిసి ప్రాసెసింగ్ ప్లాంట్‌ను శుభ్రం చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చెత్త తొలగించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని కమిషనర్ వ్యాపారులకు సూచించారు. కౌన్సిలర్ మాజీద్, శానిటరీ అధికారి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్‌కు చెందిన ప్రేమ్‌దాస్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ. 27 చెక్కు మంజూరైంది. సోమవారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పండరి, ఖేడ్ మండల తాజా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వరాచారి తదితరులున్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం

● జిల్లాస్థాయి క్రీడోత్సవాలకు భద్రతా సిబ్బందిని కేటాయించని వైనం
● డీజీపీకి ఫిర్యాదు చేస్తాం
● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు కేంద్రంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలకు భద్రత కల్పించాలని పోలీసులను కోరితే.. కనీసం కానిస్టేబుల్‌ను కూడా పంపించలేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని మైత్రి మైదానంలో జిల్లాస్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వారం రోజుల క్రితమే సంబంధిత శాఖ అధికారులు భద్రత కల్పించాలని పోలీసులకు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మళ్లీ సోమవారం ఉదయం పోలీసులను సంప్రదించినప్పటికీ స్పందించకపోవడంపై మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని 26 మండలాల నుంచి 500 మంది బాలికలు, 500 మంది బాలురు ఈ పోటీలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై లేదా అని ప్రశ్నించారు. వారం రోజుల పాటు జరగనున్న క్రీడల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా స్థానిక పోలీసులదే బాధ్యత అన్నారు. ఈ అంశంపై డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్: పరిసరాల స్వచ్ఛత, వ్యక్తిగత శుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో గల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత విషయంలో విద్యార్థులు శ్రద్ధ పెట్టాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయరాదని సూచించారు. వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ శ్రద్ధ చూపాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణంపై సమస్యలు సృష్టించొద్దు

● ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి జోన్: అమీన్‌పూర్ పట్టణ పరిధిలోని పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పాఠశాలకే కేటాయించి, నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీన్‌పూర్ పట్టణ పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలో ప్రభుత్వ పాఠశాల, మున్సిపల్ కార్యాలయం, ప్రాథమిక ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్‌లకు భూమిని కేటాయించారు. అయితే, ఇటీవల పాఠశాలకు కేటాయించిన స్థలంలో కొందరు అధికారులు పాఠశాల నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా.. అక్కడ భూమి తమదని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పాఠశాల నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, తదితరులు

నూతన చట్టాలను రద్దు చేయండి

● సీఐటీయూ కార్యదర్శి విద్యాసాగర్

జోగిపేట(అందోల్): కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను వీడాలని అందోల్ డివిజన్ సీఐటీయూ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త బ్లాక్ డేలో భాగంగా సోమవారం జోగిపేటలో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు, రైతుల కోసం తీసుకొస్తున్న నూతన చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగభూషణం, ఆటో కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

పటాన్‌చెరు టౌన్: నూతన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జాతీయ రహదారిపై నాలుగు కార్మిక లేబర్ చట్టాల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో సుమారు 20 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తోషిబా ఐఎన్‌టీయూసీ నాయకులు సంజీవ్, సుధాకర్, కిరిబి ఐఎన్‌టీయూసీ నాయకులు జాన్సన్, విజయ్, ఏషియన్ పెయింట్స్ హమాలి కార్మిక సంఘం నాయకులు రతన్‌సింగ్, అంబదాస్, సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



జోగిపేట: నిరసన కార్యక్రమంలో నాయకులు

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: కార్మికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం ఖేడ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద కార్మికులతో కలిసి ప్లకార్డులతో నిరసన చేపట్టారు.

హిందూ ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

జంగమ అర్చక పురోహితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంతోశ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): దేశ వ్యాప్తంగా హిందూ ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని జంగమ అర్చక పురోహితుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బసవేశ్వర మందిరంలో అపచార ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. అనంతరం బసవేశ్వర మందిరం నుంచి గాంధీచౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలపడం అపచారమన్నారు. వేంకటేశ్వర స్వామి ప్రసాదం కల్తీపై హిందువులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అడివయ్యస్వామి, కోశాధికారి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు అయ్యప్పస్వామి, శశిధర్, బసవలింగం, నగేశ్, శంభుప్రసాద్, ప్రవీణ్, చంద్రశేఖర్, శివకోటి, శ్రీకాంత్, బసవేశ్వర మందిరం అధ్యక్షులు గందిగరాజు, కోశాధికారి అమ్రాది రాచన్న, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర మందిరంలో అపచార ప్రాయశ్చిత్త హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అభివృద్ధిపై అసత్య ప్రచారం తగదు

● బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్: నియోజకవర్గం అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలని బీఆర్‌ఎస్ ఆయా మండలాల అధ్యక్షులు హితవు పలికారు. సోమవారం జహీరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆదేశాల మేరకు నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి టి.హరీష్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. అప్పట్లో మంజూరైన నిధులను తామే మంజూరు చేయించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహాగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, హీరూ రాథోడ్, అమిత్‌కుమార్, చిన్నారెడ్డి, రాజశేఖర్, బస్వరాజ్, ప్రభు పటేల్, ఎజాస్‌బాబా, రాములు పాల్గొన్నారు.